సీసీ రోడ్‌లను ప్రారంభించిన ఎచ్చెర్ల ఎమ్మెల్యే

విశాలాంధ్ర - రణస్థలం : పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా 40లక్షల వ్యయంతో రణస్థలం పంచాయితీ లో నిర్మించిన నాలుగు సీసీ రోడ్డులను శనివారం ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే ఎన్ఈఆర్ మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాలుగా అభివృద్ధికి నోచుకోని గ్రామాలు ఈరోజు పల్లె పండుగ ద్వారా కొత్త రూపు సంతరించుకున్నాయని ఎమ్మెల్యే వివరించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

వ్యవసాయ శాఖకు పూర్వ వైభవం తీసుకొస్తాం : మంత్రి అచ్చెన్నాయుడు

విశాలాంధ్ర - శ్రీకాకుళం : వ్యవసాయం లాభసాటిగా మారాలంటే రైతులు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని, వ్యవసాయ రంగానికి పూర్వ వైభవం తీసుకొస్తామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు ఆరుగాలం కష్టపడ్డ రైతులు తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు పొందేలా ప్రణాళిక రూపొందిస్తున్నామని చెప్పారు. ఉత్తర కోస్తాకు అనువైన లాభసాటి వ్యవసాయ విధానాలు అనే అంశంపై ఆచార్య యన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ పరిశోధనా స్థానం, రాగోలు, జిల్లా వ్యవసాయ శాఖ సంయుక్తంగా నిర్వహిస్తున్న "కిసాన్ మేళా" ను రాగోలు వ్యవసాయ పరిశోధనా కేంద్రంలో శనివారం ఆయన ప్రారంభించారు. శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు అధ్యక్షతన జరిగిన ఈ కిసాన్ మేళాలో ముఖ్య అతిథిగా మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వ్యవసాయ శాఖ పై ప్రత్యేక దృష్టి పెట్టారన్నారు. మార్టేరు ను తలదన్నేలా రాగోలు పరిశోధన స్థానాన్ని అభివృద్ధి చేస్తామని, శ్రీకాకుళం సన్నాల బియ్యంకు ప్రపంచ ఖ్యాతి వచ్చేలా కృషి చేస్తామన్నారు. "పొలం పిలుస్తుంది" కార్యక్రమం ద్వారా ప్రతి వారంలో రెండు రోజులు వ్యవసాయ, దాని అనుబంధ శాఖల అధికారులు,రైతులు దగ్గరికి వెళ్లి పొలాలు చూసి రైతులతో మాట్లాడి వారికి ఏ ఏ అవసరాలు ఉన్నాయో, కష్టాలు ఏంటి? బాధలు ఏంటని? తెలుసుకొని తద్వారా పరిష్కరించడానికి కృషి చేయాలన్నారు. తన శాఖకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని ముఖ్యమంత్రిని కోరుతానన్నారు. జిల్లాలో సకాలంలో నీరు అందక ప్రతి సంవత్సరం కరువు, కాటకాలతో వ్యవసాయం చేయలేక వలసలు వెళ్లే వారి సంఖ్య పెరుగుతుందని, దానిని నిరోధించాలని చెప్పారు. అత్యంత ప్రాధాన్యత రంగమైన వ్యవసాయాన్ని గత ఐదేళ్ల పూర్తిగా నిర్లక్ష్యానికి గురిచేయడం, కేటాయించిన బడ్జెట్ ఖర్చు చేయకపోవడంతో రైతు పరిస్థితి ఘోరంగా మారిందని అన్నారు. సబ్సిడీపై యంత్రాలను, డ్రోన్లను అందిస్తామని, సేంద్రీయ వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని, ప్రతి సంవత్సరం భూమికి భూసార పరీక్షలు నిర్వహిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాలకు డ్రోన్ల సాంకేతికతను అందుబాటులో ఉంచామని, రైతులు గ్రూపులుగా ఏర్పడి వాటి సేవలు తక్కువ ధరకు పొందవచ్చని చెప్పారు. పాఠశాల స్థాయి విద్యార్థులు కూడా తరచూ ఇలాంటి మేళా లకు హాజరై కొత్త విషయాలు నేర్చుకునేలా ప్రోత్సహించాలన్నారు. నరసన్నపేట, శ్రీకాకుళం ఎమ్మెల్యేలు బగ్గు రమణమూర్తి, గొండు శంకర్ లు మాట్లాడుతూ లాభదాయక వ్యవసాయ విధానాలపై రైతులకు సంపూర్ణ అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని అన్నారు. జిల్లా అదృష్టం కొద్దీ వ్యవసాయ శాఖకు మంత్రిగా అచ్చెన్నాయుడు ఉన్నారని, రైతుల ప్రయోజనాల కోసం ఆయన ఎంత దూరమైనా వెళ్లగలరని చెప్పారు. నైపుణ్యాభివృద్ధికి సాంకేతికతను జోడించి యువతను ఈ రంగం వైపు ఆకర్షితులు అయ్యేలా ప్రోత్సహించాలని కోరారు. కార్యక్రమంలో తొలత వివిధ శాఖలు ఏర్పాటుచేసిన వ్యవసాయ ఉత్పత్తి ప్రదర్శనలను ఆసక్తికరంగా తిలకించారు. కార్యక్రమంలో భాగంగా వ్యవసాయ యాజమాన్య పద్ధతులపై ప్రచురించిన పలు పుస్తకాలను మంత్రి ఆవిష్కరించారు. ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉప కులపతి డాక్టర్. ఆర్.శారద జయలక్ష్మి దేవి, పరిశోధన సంచాలకులు డాక్టర్ వి.వి.సత్యనారాయణ, విస్తరణ సంచాలకులు డాక్టర్ జి.శివనారాయణ, వ్యవసాయ విశ్వ విద్యాలయం డీన్ డా. సి.హెచ్. శ్రీనివాస రావు, డైరెక్టర్ సీడ్స్ డా. వై.సతీష్, శ్రీకాకుళం జిల్లా వ్యవసాయ అధికారి కె. త్రినాధ స్వామి, డాక్టర్ దానేటి శ్రీధర్, ఉత్తరకోస్తా మండల వ్యవసాయ శాఖాధిపతులు, పెద్ద సంఖ్యలో జిల్లా నుండి రైతులు, ఎఫ్పిఓ, ఎన్జీవో, వ్యవసాయ కళాశాల, వ్యవసాయ ఇంజినీరింగ్ డిప్లమో విద్యార్థులు ఈ మేళాలో పాల్గొన్నారు.

ప్రభుత్వ మద్యం షాపుల సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలి

సీపీఐ జిల్లా కార్యదర్శి చాపర వెంకటరమణ

విశాలాంధ్ర - ఆమదాలవలస : ప్రభుత్వ మద్యం షాపుల్లో పని చేసిన సేల్స్ మెన్లు, సూపర్వైజర్లు లను విధుల్లోకి తీసుకొని, ఉద్యోగ భద్రత కల్పించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి, వైన్ షాప్ సూపర్వైజర్, హెల్పర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు చాపర వెంకటరమణ అన్నారు. ఆమదలవలస నియోజకవర్గంలో ఆ సంఘ సమావేశమును శనివారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బకాయిపడిన వేతనాలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని అన్నారు. గత ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బేవరేజెస్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఔట్సోర్సింగ్ ప్రాతిపదికన ప్రభుత్వ మద్యం షాపుల్లో పలువురిని ఇంటర్వ్యూలు నిర్వహించి ఉద్యోగాల్లోకి తీసుకుందని, ప్రస్తుత ప్రభుత్వం మద్యం పాలసీ విధానాన్ని మార్చి వారి యొక్క కుటుంబాలను వీధిన పడేసిందని ఆవేదన చెందారు. వారికి రావలసిన బకాయి పడ్డ జీతాలు, బోనస్ లు కూడా ప్రభుత్వం చెల్లించాలని కోరారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకొని వారందరికీ ఉద్యోగ భద్రత కల్పించి ఆదుకోవాలన్నారు. అనంతరం ఆమదాలవలస నియోజకవర్గ కమిటీని ఎన్ను కున్నారు. నియోజకవర్గ అధ్యక్షునిగా కీర్తి ధర్మారావు, కార్యదర్శిగా సి హెచ్ రాజు, ఉపాధ్యక్షులుగా సంతోష్ కుమార్, పాపారావు సహాయ కార్యదర్శులుగా తేజేశ్వరరావు, కిరణ్, కోశాధికారిగా యాళ్ల చక్రిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘ నాయకులు సంతోష్ కుమార్, ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి మొజ్జాడ యుగంధర్, ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొన్న శ్రీనివాసరావు, మద్యం దుకాణాల కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

మత్తు రహిత జిల్లాగా మారుద్దాం : జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

విశాలాంధ్ర - శ్రీకాకుళం టౌన్ : గంజాయి, డ్రగ్స్ లపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, వాటిని నిర్మూలించి మత్తు పదార్థాల రహిత జిల్లాగా మార్చడమే ధ్యేయంగా పని చేయాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పిలుపునిచ్చారు. యువత ఉజ్వల భవిష్యత్తును నాశనం చేసే వాటి వినియోగాన్ని పూర్తిగా రూపుమాపేందుకు ప్రజలందరూ భాగస్వాములు కావాలని అన్నారు. కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన జిల్లా స్థాయి నార్కో కోఆర్డినేషన్ సెంటర్ (ఎన్‌సీఓఆర్‌డీ) కమిటీ సమావేశంలో జిల్లా ఎస్పీ కేవీ.మహేశ్వర్ రెడ్డి తో కలసి ఆయన మాట్లాడారు. జిల్లాలో గంజాయి, ఇతర డ్రగ్స్ వాడకాన్ని అరికట్టేందుకు తీసుకుంటున్న చర్యలపై ఈ సందర్భంగా సమీక్ష నిర్వహించారు. తొలుత జిల్లా పోలీసు సూపరింటెండెంట్ కేవీ.మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ ఈ ఏడాది ఇప్పటి వరకూ 37 కేసులు నమోదు చేశామని, 108 మందిని అరెస్టు చేయగా, అందులో ఇద్దరు విద్యార్థులు ఉన్నారని చెప్పారు. గంజాయి విక్రయాలు, వినియోగం జరగకుండా కఠిన చర్యలు తీసుకుని, గంజాయి విక్రయిస్తున్న వారిపై సస్పెక్ట్ షీట్, రౌడీ షీట్ తెరిచామన్నారు. యాంటీ డ్రగ్ కమిటీలు ఏర్పాటు చేసి సంకల్పం పేరిట కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని వివరించారు. మానవ అక్రమ రవాణా (హ్యూమన్ ట్రాఫికింగ్) నిరోధానికి చేపడుతున్న చర్యలను వివరించారు. ఈ ఏడాది ఇప్పటివరకు 73 మంది పిల్లలను అక్రమ రవాణా నుంచి కాపాడ గలిగామని వారిలో 68 మందిని వారి తల్లిదండ్రుల వద్దకు చేరవేయగలిగినట్లు చెప్పారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వినియోగం, వాటికి సంబంధించిన ఫిర్యాదుల నమోదు, అలాగే డి-అడిషన్ కేంద్రాల సేవలకి టోల్ ఫ్రీ నెంబర్ 14446 పని చేస్తున్నదని పేర్కొన్నారు. తమ సమస్యలు, ఫిర్యాదులు ఈ నెంబర్ ద్వారా తెలియజేయవచ్చన్నారు. రిమ్స్ ఆసుపత్రిలో డి-అడిక్షన్ ను కూడా పూర్తి స్థాయిలో నిర్వహించేందుకు సాధ్యా సాధ్యాలపై కమిటీని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. గంజాయి వ్యాప్తిని మరింతగా అరికట్టేందుకు అన్ని ప్రభుత్వ శాఖల సమన్వయం ఎంతో అవసరమని అన్నారు. విశాఖపట్నం నుంచి సమావేశానికి హాజరైన రెవిన్యూ ఇంటిలెజెన్స్ డిప్యూటీ డైరెక్టర్ పూజా పుండ్కర్ మాట్లాడుతూ జిల్లాలో ఒడిశాతో సరిహద్దు ఉందని అధికారులకు స్మగ్లింగ్ అంశాలపై పూర్తిస్థాయి అవగాహన కలిగి ఉండాలని, వారిని పట్టించేందుకు వ్యూహం రూపొందించాలన్నారు. డ్రగ్స్, బంగారం, జంతువుల చర్మాలు, కొమ్ములు, తదితర అక్రమ రవాణాపై ఉక్కు పాదం మోపాలన్నారు. యువత భవిష్యత్తును నాశనం చేస్తున్న గంజాయి నిర్మూలించాలంటే, దాని అక్రమ రవాణా నిరోధానికి అందరూ సహకరించాలని కోరారు. సమావేశంలో అదనపు ఎస్పీ శ్రీనివాసరావు, ఆర్డీవోలు సాయి ప్రత్యూష, కృష్ణ మూర్తి, గణేష్, డీఎస్పీలు సిహెచ్. వివేకానంద, డిఎంహెచ్ఓ బి.మీనాక్షి, ఐసిడిఎస్ పీడీ బి.శాంతి శ్రీ, డీపీవో భారతి సౌజన్య, అటవీ శాఖ, డ్రగ్ కంట్రోల్, విద్యాశాఖ, పోలీస్ ఇన్స్పెక్టర్లు, రవాణా, ఆర్టీసీ, ఎక్సైజ్, పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

సుడా ఛైర్మన్‌గా యువ పారిశ్రామికవేత్త జనసేన నేత కొరికాన రవికుమార్

విశాలాంధ్ర కొత్తూరు/ఎల్.ఎన్‌పేట : శ్రీకాకుళం అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ, ఛైర్మెన్‌గా యువ పారిశ్రామిక వేత్త జనసేన పార్టీకి చెందిన కొరికాన రవికుమార్‌ను రాష్ట్ర ప్రభుత్వం శనివారం నియ మించింది. జనసేన పార్టీ పాతపట్నం నియోజక వర్గ నాయకురాలు కొరికాన భవాని ఆమె భర్త కొరికాన రవికుమార్ 2023లో జనసేనా పార్టీలో చేరారు. ఎన్నికల్లో పాత పట్నం నియోజకవర్గం లోనే కాకుండా జిల్లా వ్యాప్తంగా కూటమి అభ్యర్థుల గెలుపు నకు కొరికాన భవాని, రవి కుమార్‌లు ఎంతగానో కృషి చేశారు. రవికుమార్‌కు సుడా ఛైర్మన్ పదవి రావడంతో పాతపట్నం నియోజకవర్గంలో పలువురు అభినందనలు తెలియజేశారు. కాగా. రవి కుమార్ భవానిల స్వగ్రామం పాతపట్నం నియోజిక వర్గం ఎల్. ఎన్.పేట మండలం మిరియాబిల్లీ రవి కుమార్ పాండిచ్చేరి. లో ఆక్వా రంగం వ్యాపారం 2024 ఎన్నికల్లో కొరికాన భవాని పాత పట్నం నుండి జనసేనా పార్టీ అభ్యర్థిగా పోటీకి ప్రయత్నం చేసి నా ఫలించ లేదు కూటమి పార్టీల సర్దుబాట్లులో ఆ సీటు టీడీపీ కి దక్కింది అయినా నిరాశపడక టీడీపీ విజయానికి జే.ఏస్.పి నేతలు. కొరికాన భవాని, రవి కుమార్‌లు గట్టి కృషి చేశారు రాబోయే ఎన్నికలు 2029 అయినా లేదా అంతక ముందు ఆయనా పాతపట్నం జే.ఏస్.పి అభ్యర్థిగా పోటీకి ఇప్పటి నుండే కొరికాన భవాని సిద్ధం, అంటూ ఆదిశగా పాతపట్నం నియోజిక వర్గం లో జనాసేన పార్టీని పటిష్టం చేస్తున్నారు.

గోపాష్టమి సందర్భంగా గో సేవలో ఎంపీ కలిశెట్టి

విశాలాంధ్ర - రణస్థలం : మండలం విజయనగరం పార్లమెంట్ సభ్యులు కలిశెట్టి అప్పలనాయుడు శనివారం రణస్థలం మండలం కోష్ట గ్రామంలో గోపాష్టమి సందర్భంగా ఏర్పాటు చేసిన పుణ్యకార్యక్రమాల్లో పాల్గొన్నారు. గ్రామంలోని శ్రీకృష్ణ చైతన్య మఠం గో సేవ ఆశ్రమంలో గోపాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని సుదర్శన యజ్ఞం, గోపూజ, గో పరిక్రమ, గోదానం కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈ విశిష్టమైన సందర్భంలో కుటుంబ సమేతంగా విచ్చేసిన ఎంపీ అప్పలనాయుడు ఈ కార్యక్రమాల్లో శ్రద్ధగా పాల్గొన్నారు. గోపాష్టమి రోజున గోవులను పూజించడం అనేది భారతీయ సంస్కృతిలో అత్యంత పవిత్రమైన పరంపర. గోపూజ ద్వారా గోమాతల పట్ల మన గౌరవం, భక్తిని వ్యక్తం చేయడమే కాక, వారి పరిరక్షణకు కూడా తోడ్పాటు అందించడం మన కర్తవ్యంగా భావిస్తారు. ఈ ఉత్సవాల్లో పాల్గొన్న ఎంపీ అప్పలనాయుడు గోమాతలకు ప్రత్యేక పూజలు నిర్వహించి, గోవులను ఆదరించడంలో ప్రజలందరికీ ఒక ఆదర్శంగా నిలిచారు. ఈ సందర్భంగా మఠం అభివృద్ధికి తన వంతుగా సహకారం అందించాలని సంకల్పించి, పార్లమెంట్ సభ్యుడిగా తన నెల జీతాన్ని గుడి నిర్మాణానికి విరాళంగా ఇవ్వడానికి ముందుకొచ్చారు. ఇది ఆయన సాంప్రదాయాలకు విలువ ఇచ్చే చిత్తశుద్ధిని, గ్రామాభివృద్ధిపట్ల ఉన్న చిత్తశుద్ధిని ప్రతిబింబిస్తుంది. అదేవిధంగా గుడి నిర్మాణానికి ఆయన స్వయంగా ఫౌండేషన్ స్టోన్ వేయడం ద్వారా ఆ మఠం అభివృద్ధికి తన మద్దతు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న గ్రామస్థులు, భక్తులు మంత్రోచ్ఛారణల నడుమ శాంతియుత వాతావరణంలో గోమాతల సేవను ఘనంగా జరుపుకున్నారు. ఈ విశేషమైన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీ అప్పలనాయుడు సేవా నిరతికి, సానుకూల వైఖరికి హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంలో ఆయన చేసిన మాటలు గోపూజకు, మఠం అభివృద్ధికి ప్రజల ఆదరణ పెంచటానికి దోహదం చేశాయి.

కృష్ణంనాయుడు కష్టానికి ప్రతిఫలం..కళింగ కార్పొరేషన్ ఛైర్మన్ పదవి

విశాలాంధ్ర - నరసన్నపేట : అడ్వకేట్, పోలాకి మాజీ జెడ్పీటిసి, రోణంకి కృష్ణం నాయుడు కష్టానికి ప్రతిఫలం లభించింది. కళింగ సామాజిక సంక్షేమ రాష్ట్ర కార్పొరేషన్ ఛైర్మన్ పదవి కృష్ణంనాయుడుకు వరించింది. ఈ సంధర్భంగా శనివారం ఆయన విశాలాంధ్రతో మాట్లాడుతూ పోలాకి మండలం ఉరజాం గ్రామంలో జన్మించానని, ప్రాథమిక విద్య అంతా పోలాకిలో జరిగిందని తెలిపారు. ఇంట ర్మీడియట్, డిగ్రీ నరసన్నపేటలో చదివా నన్నారు. అనంతరం విశాఖపట్నంలో లా చదివానని తెలిపారు. ఓటుహక్కు లేని నాటి నుండి రాజకీయాలంటే ఇష్టమని, రాజకీయాలు ఆసక్తి కల్గటానికి కారణం నరసన్నపేట మాజీ ఎమ్మెల్యే, డోల సీతారాములునాయుడని తెలిపారు. తెలుగుదేశం పార్టీ అధికారంలో వున్న 1998వ సంవత్సరంలో మధ్యంతర జిల్లా పరిషత్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరపున పోలాకి జెడ్పీటిసిగా పోటీ చేసిన నేను సీతారాములు నాయుడు సహకారంతో గెలుపొంది, జిల్లా పరిషత్‌లో అడుగు పెట్టానన్నారు. ఆ తర్వాత 2012వ సంవత్సరం వరకూ కాంగ్రెస్ పార్టీలో కొనసాగానన్నారు. 2013వ సంవత్సరం రాష్ట్ర విభజన అనంతరం అప్పటి రాజకీయ స్థితిగతులు, రాజకీయ సమీకరణాలను దృష్టిలో పెట్టుకొని, రాష్ట్ర అభివృద్ధి, భవిష్యత్తు తెలుగుదేశం పార్టీతోనే సాధ్య మవుతుందని, విజనరీ నాయకుడుగా పేరుపొందిన నారా చంద్రబాబునాయుడు, నరసన్నపేట నియోజకవర్గానికి ఎమ్మెల్యేగా బగ్గు రమణమూర్తిని పోటీకి నియమించటం, రమణమూర్తి మంచితనానికి, ఆయనకున్న సద్గుణాలకు మెచ్చి, ఆయనతోనే రాజకీయాల్లో ప్రయాణం చేయాలని నిశ్చయించు కున్నానన్నారు. అంతేకాక 2014, 2019, 2024వ సంవత్సరాల్లో నిర్వహించిన సాధారణ ఎన్నికల్లో నేను మా బూత్‌లో ఎన్నికల జనరల్ ఏజెంట్‌గా వ్యవహరించి, ఎమ్మెల్యే, రమణ మూర్తికి నావంతు సహాయమందించాను, తెలుగుదేశం పార్టీ క్రమశిక్షణగల వ్యక్తులకు, కష్టపడిన వ్యక్తులకు పదవులు వస్తాయనటానికి ఇది ఒక నిదర్శనం. కళింగ కార్పొరేషన్ రాష్ట్ర ఛైర్మన్‌గా నన్ను నియమించినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి, చంద్రబాబునాయుడుకు, రాష్ట్ర యువ నాయకులు, నారా లోకేష్‌కు, రాష్ట్ర వ్యవసా యశాఖ మంత్రి, కింజరాపు అచ్చె న్నాయుడుకు, కేంద్ర మంత్రి,కింజారపు రామ్మోహన్ నాయుడుకు, ముఖ్యంగా నియోజక వర్గ ఎమ్మెల్యే, బగ్గు రమణమూర్తికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియ చేసుకుంటున్నానని తెలిపారు. టిడిపి ఆదేశాల మేరకు కళింగ సామాజిక వర్గంలో ఉన్న బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి నావంతు కృషి చేస్తానని తెలిపారు.

అపార్ వివరాల నమోదు వేగవంతం చేయాలి

విశాలాంధ్ర - కవిటి : విద్యార్థుల అపార్ వివరాల నమోదును వేగ వంతం చేయాలని ఎంఈవో ధనుంజయ మజ్జి, ఎంపీడీవో శ్రీనివాస్ రెడ్డి, తహ సీల్దార్ మురళీ మోహన్ అన్నారు. ఈ మేరకు శనివారం కవిటి ఎంపీ డీవో కార్యాలయంలో ప్రధానో పాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వివరాలు నమోదులో సందేహాలు ఉంటే స్థానిక ఎమ్మార్సీ కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయంలో సంప్రదిస్తే నివృత్తి చేస్తారని సూచించారు. ఈ వివరాల నమోదుకు తక్కువ సమయం ఉన్నందున ఉన్నతాధికారుల ఆదేశాలు మేరకు ప్రతీ పాఠశాలలో 100 శాతం నమోదు పూర్తి చేయాలని, ఏ కారణం వల్ల నమోదు చేయలేకపోతున్నారో లిఖిత పూర్వకంగా వివరణ ఇవ్వాల్సి ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

చల్లవానిపేట జంక్షన్‌లో రింగురోడ్డు ఏర్పాటు అయ్యేనా..?

విశాలాంధ్ర - జలుమూరు : నరసన్నపేట మండలం జమ్ము జంక్షన్ నుండి పాతపట్నం వరకు గత నాలుగు సంవత్సరాలుగా ఎన్ హెచ్ ఫైవ్ రోడ్డు నిర్మాణాలు జరుగుతున్నాయి. చాలా ప్రాంతాల్లో ఫ్లై ఓవర్ వంతెనలు అండర్ ప్రాసెస్ రోడ్లు ఏర్పాటు జరిగాయి. అన్ని గ్రామాల రహదారులు వెడల్పు చేశారు. రహదారికి అవసరమగు స్థలాన్ని సేకరించి రోడ్డు నిర్మాణాలు పూర్తి చేశారు. పాతపట్నం తిలారు రైల్వే గేట్ ప్రాంతాల్లో ఫ్లైఓవర్ వంతెన నిర్మాణ పనులు పూర్తిఅవవలసి ఉంది. ఈ రహదారి నిర్మాణంలో భాగంగా నాలుగు మండలాల కూడలి ప్రదేశం అయిన చల్లవానిపేట జంక్షన్‌లో రింగ్ రోడ్డు నిర్మాణం చేపట్టాలని సర్వే జరిపి విడిచిపెట్టారు. రహదారులు కూడా అనుకున్నంత స్థాయిలో వెడల్పు కాకపోవడం నిరంతరం ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతుందని పలువురు విమర్శిస్తున్నారు. అసలు ఇక్కడ రింగ్ రోడ్డు ఏర్పాటు అయ్యానా లేదా అనే సమస్య సతమతమవుతుంది.

ముమ్మరంగా తెదేపా సభ్యత్వాల నమోదు

విశాలాంధ్ర - కవిటి : మండలంలో గల బెలగాం పంచాయతీలో తెదేపా సభ్యత్వ నమోదును తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, ఎంపీటీసీ ప్రతినిధి సంతోష్ కుమార్ పట్నాయక్, తెదేపా మండల అధ్యక్షులు మణిచంద్ర ప్రకాష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెదేపా జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు, ఇచ్ఛాపురం నియోజకవర్గ శాసనసభ్యులు బెందాళం అశోక్ ఆదేశాల మేరకు సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు.సభ్యత్వ నమోదును రికార్డు స్థాయిలో చేపట్టేందుకు తెలుగు దేశం విస్తృత ఏర్పాట్లు చేస్తోందని అన్నారు.కేవలం రూ.100లు సభ్యత్వంతో టీడీపీ కార్యకర్తలకు రూ.5 లక్షల వరకు ప్రమాద బీమా, వారి కుటుంబ సభ్యులకు విద్య,వైద్యం, ఉపాధి కోసం సాయం అందించనున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెదేపా నాయకులు మోహన్ రావు, సునీల్, తెదేపా కార్యకర్తలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక రాంప్‌ను పరిశీలించిన శ్రీకాకుళం ఆర్డీవో

విశాలాంధ్ర - నరసన్నపేట : మండలంలోని గోపాలపెంట ఇసుక రాంప్‌ను శనివారం శ్రీకాకుళం ఆర్డీఓ, సాయి ప్రత్యూష పరిశీలించారు. ఈ సంధర్భంగా ఆమె రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రాంప్ నిర్వహణలో ఏమైనా ఇబ్బందులు ఉంటే తెలియచేయాలని, ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా ఇసుక రవాణా చేసినట్లయితే తీవ్రమైన చర్యలు తీసుకుంటామన్నారు. అంతేకాక రాత్రి వేళల్లో ఇసుకను అక్రమంగా తరలించినట్లయితే వాహనాలను సీజ్ చేసి, దానికి బాధ్యులైన వారిపై క్రిమినల్ చర్యలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్, టి.సత్యన్నారాయణ, ఎన్నికల డిటి, శరత్, విఆర్వో, పంచాయితీ కార్యదర్శి, రాంప్ నిర్వాహకులు పాల్గొన్నారు.

కూరగాయల సాగుతో మంచి లాభాలు

విశాలాంధ్ర - జలుమూరు : సారవకోట మండలం కిన్నెరవాడ తొగిరి కిడిమి జలుమూరు మండలం నగరికటకం టి.లింగాలపాడు, రాణా, జలుమూరు మండల సరిహద్దు నవడం రేగులపాడు పరిసర గ్రామాల్లో అధిక శాతం కూరగాయల సాగు చేస్తున్నారు. ప్రస్తుత తరుణంలో కష్టపడి రైతు సాగు చేస్తే మంచి దిగుబడితో పాటు అనుకూల ధరలు ఉన్నందున రైతుకు లాభాలు వస్తాయని రైతు అభిప్రాయం వ్యక్తపరిచారు. క్యాబేజీ బుట్ట క్యాబేజీ పువ్వు ఆనప ఆకుకూరలు వంటి పంటలు సాగు చేస్తున్నారు. పై గ్రామాల్లో రైతు నిరంతరం ఈ పంటలపై శ్రద్ధ చూపిస్తున్నారు. ఈ పంటలతో కుటుంబాలు బాగుపడుతున్నట్లు పలువురు అంటున్నారు.

స్కాలర్ షిప్ కొరకు ధరఖాస్తుల ఆహ్వానం

విశాలాంధ్ర - కవిటి : కవిటి మండలంలో శ్రీశయన కుల పేద విద్యార్థులు 2024వ సంవత్సరంలో 10వ తరగతి, ఇంటర్, ఎంసెటు, నీటు, ఐసెటు, పీజీసెటులో ప్రతిభ కనబరిచిన పేద విద్యార్థులకు కౌండిన్య ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ద్వారా ఉపకార వేతనాలు అందిస్తున్నట్లు ఆ కుల సంఘం అధ్యక్షులు దేవాడ.మోహన రావు ఒక ప్రకటనలో తెలిపారు. మాట్లాడుతూ 10 తరగతిలో ఏ గ్రేడ్, బి గ్రేడ్ వచ్చినవారు.ఇంటర్లో ఏ,బి, గ్రేడ్లు సాధించిన వారు ఇంకను ఉన్నత విద్యలో ప్రతిభ కనబరిచిన వారు ధరఖాస్తులు తే 07.12.24 దిలోపు ఆన్లైన్లో చేసుకోవాలని సూచించారు.

ప్రతి ఒక్కరూ టీడీపీ సభ్యత్వ నమోదు చేసుకోండి...

విశాలాంధ్ర - టెక్కలి : రాష్ట్ర వ్యాప్తంగా ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రారంభించినటువంటి టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నా యుడు, కేంద్ర పౌర విమానయన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ ఆదేశాలు మేరకు మండలంలో తలగాం పంచాయతీలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బగాది శేషగిరి రావు ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమం లో శ్రీకాకుళం జిల్లా పార్లమెంటరి పార్టీ ఉపాధ్యక్షులు హనుమంతు రామకృష్ణ, దివ్వల ప్రసాద్, డివి రమణ, బంగారు ఆదినారాయణ, చిన్నబాబు, వీరగట్టం రామారావు శశి భూషణరావు తలగాం పంచాయతీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీలు ఉపసంహరించకపోతే ఉద్యమం తప్పదు : సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

విశాలాంధ్ర - పలాస : టిడిపి నాయకత్వంలో కూటమి ప్రభుత్వం వైసిపి విధానాలను కొనసాగిస్తే ప్రజల నుండి ప్రతిఘటన తప్పదని,రాష్ట్ర ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలను ఉపసంహరించుకోకపోతే ఉద్యమం తప్పదని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు హెచ్చరించారు. సిపిఎం పార్టీ 18వ జిల్లా మహాసభలు సందర్భంగా పలాస ఆర్టీసీ కాంప్లెక్స్ నుండి పాత బస్టాండ్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం సిపిఎం నాయకులు కోనారి మోహనరావు అధ్యక్షతన జరిగిన సభలో శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఇప్పటికే సర్దుబాటు చార్జీలు 6,072 కోట్లు మోపి ఇప్పుడు కొత్తగా 11,000 కోట్ల రూపాయలు ప్రజలపై భారాలు వేయడం దుర్మార్గమని విమర్శించారు. ఈ విద్యుత్ చార్జీలు పెంపు వలన వినియోగదారులపై ఒక యూనిట్ కి రూ:1.80పైసల నుండి రూ:2.40 పైసలు అదనపు భారం పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కోస్టల్ కారిడార్ పేరుతో సముద్ర తీర భూములన్ని కార్పొరేట్లకు కట్టపెట్టే కుట్ర చేస్తున్నాయని దీనికి వ్యతిరేకంగా ఉద్యమం తప్పదని హెచ్చరించారు. విధానపరంగా గత వైసిపి ప్రభుత్వానికి నేడు కూటమి ప్రభుత్వానికి ఎటువంటి తేడా లేదని ఆరోపించారు.ఆంధ్రుల ఆత్మ బలిదానాలతో సాధించిన విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని, ప్రైవేటీకరణ జోలికి వస్తే పోరాటంతో తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. సిపిఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.తులసీదాస్ మాట్లాడుతూ సముద్ర తీరంలో ఉన్న ఉప్పు భూములు సి.ఆర్.జెడ్ భూములు పోర్టుకు అప్పజెప్పడానికి కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తుందని ఆరోపించారు. దీనివలన తరతరాలుగా జీవనం కొనసాగిస్తున్న ఉప్పు రైతులకు నష్టం జరుగుతుందని అన్నారు. జీడి పిక్కల 80 కేజీలు బస్తాకు రూ :16,500 చెల్లించి రాష్ట్ర ప్రభుత్వం ఆర్బికేల ద్వారా కొనుగోలు చేయాలని జీడి కార్మికులకు పిఎఫ్, ఈఎస్ఐ, అమలు చేయాలని, జిల్లాలో వంద పడకల ఈఎస్ఐ ఆసుపత్రి నిర్మించాలని డిమాండ్ చేశారు. జిల్లాలో గిరిజన భూములను గిరిజనేతరులు ఆక్రమించుకుంటున్నారని దీనికి వ్యతిరేకంగా ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. జిల్లాలో ఐటీడీఏ లేకపోవడంతో గిరిజనులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విశాఖ డైరీ పాలు రేటు తగ్గించడం వల్ల పాలరైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు మాట్లాడుతూ సిపిఎం పార్టీ 18వ జిల్లా మహాసభల్లో జిల్లాలో ప్రజలు ఎదుర్కొంటున్న అన్ని సమస్యల పైన చర్చించి భవిష్యత్తు కర్తవ్యాల్ని ఈ మహాసభల్లో రూపొందించడం జరుగుతుందని అన్నారు. వంశధార రెండో దశ పూర్తి చేసి శివారు భూములకు నీరు ఇవ్వాలని, నిర్వాసితులకు 2013 భూ సేకరణ చట్టం అమలు చేయాలని, రిమ్స్ ని సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి గా ప్రమోట్ చేయాలని డిమాండ్ చేశారు. బహిరంగ సభలో సిపిఎం పార్టీ నాయకులు బి.కృష్ణమూర్తి, జి.సింహాచలం, కే.నాగమణి, నంబూరు. షణ్ముఖరావు, పి.తేజేశ్వరరావు, సిర్ల.ప్రసాద్, పోలాకి ప్రసాదరావు తదితరులు ప్రసంగించారు. సిపిఎం స్థానిక నాయకులు ఎం.గణపతి ఆహ్వానం పలకగా సంగారు.లక్ష్మీనారాయణ వందన సమర్పణ చేశారు.

ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేస్తాం : ఎమ్మెల్యే శిరీషా

విశాలాంధ్ర-వజ్రపుకొత్తూరు : ప్రతి మారుమూల గ్రామాన్ని అభివృద్ధి చేస్తామని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీషా అన్నారు. శనివారం మండలంలో చీపురుపల్లి పంచాయితీ కొండపల్లి గ్రామంలో 11 లక్షల 20వేల రూపాయల నిధులతో సిసి రోడ్డు నిర్మాణాన్ని ఆమె భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పేదప్రజలకు అండగా ఉంటుందని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇచ్చిన మాట ప్రకారం మహిళలకు గ్యాస్ దిమ్మలో సంవత్సరానికి మూడు చొప్పున మంజూరు చేశారన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షులు సూరాడ మోహనరావు, అరసవెల్లి ఉమామహేశ్వరరావు, లైసెట్టి భీమారావు, సాతుపల్లి కామేశ్వరరావు, సర్పంచ్ ప్రతినిధి దాసరి పాపారావు, గుత్తేదారుడు యంపల్లి తులసిరావు, జోగారావు, ఎంపిటిసి సురేఖలు పాల్గొన్నారు.

విశాలాంధ్ర

పేజి : 2

శ్రీకాకుళం

ఆదివారం 10, నవంబరు 2024

సూపర్ సిక్స్ హామీలపై శాసన మండలిలో నిలదీస్తా : ఎమ్మెల్సీ నర్తు రామారావు

విశాలాంధ్ర-కవిటి: కూటమి ప్రభుత్వం ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలపై శాసన మండలిలో నిలదీస్తానని ఎమ్మెల్సీ నర్తు రామారావు అన్నారు. శనివారం ఆయన స్వగృహంలో పత్రిక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో దిగువ, మధ్యతరగతి కుటుంబాలకు అందించిన సంక్షేమ పథకాలు ఎందుకు అమలు చేయడం లేదని, సంక్షేమ పథకాలు అందక వారంత పలు ఇబ్బందులకు గురవుతున్నారని, రైతు భరోసా నిధులు ఇప్పటికీ అందించలేదని వీటిపై శాసనమండలిలో నిలదీస్తానని అన్నారు. విద్యార్థులకు ఫీజు రియింబర్స్మెంటు అందక అవస్థలు పడుతున్నారని, వారు తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. తక్షణమే వారికి రావాల్సి బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ శీతాకాల సమావేశాలలో ప్రవేశపెట్టనున్న బడ్జెట్ సంక్షేమ రంగానికి ఎంత ప్రాధాన్యత కల్పిస్తుందో చూడాల్సి ఉంది. ప్రభుత్వం ఏర్పడిన ఐదు మాసాల తర్వాత పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెడుతున్నారంటే, హామీల నుంచి వారు తప్పించుకునే ధోరణికి అద్దం పడుతోందని ఎమ్మెల్సీ పేర్కొన్నారు. ఇప్పటికే ఖరీఫ్ ముగిసిపోయి రబీ సీజనుకు రాష్ట్రవ్యాప్తంగా రైతులు సన్నద్ధం అయ్యారని, కానీ వారికి రైతు భరోసా నిధులు ఇప్పటికీ జమ కాలేదని, విద్యార్థులు మరో రెండు మాసాలలో వారి వార్షిక సంవత్సరం ముగిసిపోనుందని అయినప్పటికీ అమ్మ ఒడి డబ్బులు ఒసే ప్రభుత్వానికి లేదని అన్నారు. ప్రభుత్వం నూతనంగా ఏర్పడిన తర్వాత వాలంటీర్ల వ్యవహారంపైన నిర్ణయం తీసుకుంటామని తెలిపి కాలక్షేపం చేస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వాలు మారినా విధానపరమైన నిర్ణయాల అమలులో మార్పులు ఉండకూడదని ఎమ్మెల్సీ సూచించారు. చట్టసభలో తనకు మాట్లాడే అవకాశం వస్తే జిల్లాలో ఉన్న ప్రధానమైనటువంటి సమస్యల పరిష్కారానికి, నియోజకవర్గంలో ఉన్న ఇష్యులను శాసనమండలి వేదికగా ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్తానని స్పష్టం చేశారు. నదుల అనుసంధానం, పారిశ్రామిక అభివృద్ధి అవసరాన్ని తెలియచేస్తానని తెలిపారు. శ్రీకాకుళం జిల్లా వ్యవసాయ, ఉద్యాన రంగాలకు ఒకప్పుడు పెట్టింది పేరని గోదావరి జిల్లాల తర్వాత అంతటి ప్రాధాన్యత ఈ రెండు రంగాలకు మన జిల్లాయే ఉండేదని కానీ ప్రస్తుత పరిస్థితులు పరిశీలిస్తే, సాగునీరు లేక జిల్లాలో సగం నియోజకవర్గాలు తీవ్ర ఇబ్బందులకు గురై వ్యవసాయ కుటుంబాలు అప్పుల ఊబిలో కూరుకుపోయాయని తెలిపారు. ప్రకృతి వైపరీత్యాలు, చీడపీడల కారణంగా ఉద్యాన రంగం కూడా దిగజారి పోయింది. దీంతో ప్రజల జీవన ప్రమాణాలు పూర్తిగా పడిపోయాయి.అపార వనరులు ఉన్న జిల్లాను ఇటువంటి పరిస్థితులలో ఆదుకునేందుకు పాలకుల ప్రత్యేక దృష్టి సారిస్తే, వ్యవసాయ కుటుంబాల బతుకుల్లో నిజంగానే పూర్వ వైభవం వస్తుంది. జిల్లాకు కీలకమైన వంశధార నది జలాలను శివారు నియోజకవర్గాలకు అందిస్తే, బహుద నదికి అనుసంధానం చేస్తే వ్యవసాయ రంగానికి ఊతం దొరుకుతుందని తెలిపారు.అదే రకంగా ఏ జిల్లాలో లేనివిధంగా మన జిల్లా నుంచి అధికంగా వలసలు ఉన్నాయని వీటిని నివారించాలంటే జిల్లాలో పరిశ్రమలను ఏర్పాటు చేయాలని అన్నారు.సాగర తీరం 193 కిలోమీటర్లు వ్యాపించి ఉందని,ఈ తీరంలో పర్యాటక అభివృద్ధి చేపట్టి, మత్స్యకారులకు శీతల గిడ్డంగులు, ఫిషింగ్ జట్టీలు ఏర్పాటు చేస్తే వారికి మేలు జరుగుతుంది. వ్యవసాయ మంత్రి జిల్లా నుంచి ప్రాతినిధ్య ఊహిస్తున్నారు కాబట్టి, అత్యధిక నిధులు సాధించి వ్యవసాయ రంగానికి అనుసంధానమైన నీటిపారుదల శాఖతో సమన్వయం చేసుకుంటూ మేజర్ మైనర్ ఇరిగేషన్ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు.బెంతొరియాల కుల ధ్రువీకరణకు సంబంధించి కూడా మండలిలో ప్రస్తావిస్తానని, జిల్లా సమస్యల పరిష్కారానికి మండల చైర్మన్ మోషేన్ రాజు సహకారంతో ప్రభుత్వం దృష్టికి సమస్యలను తీసుకు వెళ్తానని, శాసనమండలి సభ్యులు నర్తు రామారావు వివరించారు.

మొక్కలు పెంచేందుకు కోట్లు ఖర్చు... ఎక్కడ చూసిన కనిపించవు..!

విశాలాంధ్ర-జలుమూరు : అనేక ప్రాంతాల్లో రహదారులకు ఇరువైపులా పచ్చని మొక్కలు నాటాలని గత మూడు దశాబ్దాలుగా ప్రభుత్వం అనేక శాఖలు కోట్లు ఖర్చు చేశారు. ఏ రహదారి ప్రక్కన చూసినా పట్టుమని పది మొక్కలు కనిపించవు 1990లో నాటి ప్రభుత్వం జలుమూరు మండలం చల్లవానిపేట నుండి పుణ్యక్షేత్రం శ్రీముఖలింగం వరకు 17 కిలోమీటర్లు రహదారి ఇరువైపులా అనేక మొక్కలు నాటారు. వాటిని పెంచేందుకు లక్షల ఖర్చు చేశారు. అనంతరం పచ్చదనం పరిశుభ్రత తరువాత పచ్చని చెట్టు ప్రగతికి మెట్టు సామాజిక అటవీ శాఖ ఆధ్వర్యంలో మరికొన్ని ఉపాధి హామీ పథకం కింద మరికొన్ని అనేక శాఖల ద్వారా అనేక దఫాలుగా మొక్కల కోసం లక్షల ఖర్చు చేసిన సంగతి అందరికీ తెలిసిందే ముప్పై సంవత్సరాలుగా చల్లవానిపేట జంక్షన్ నుండి సారవకోట చల్లవానిపేట జంక్షన్ నుండి శ్రీముఖలింగం మరియు నరసన్నపేట వెళ్లే రహదారిలో ఎక్కడ మొక్కలు కనిపించవు ఇదిలా ఉండగా కొద్ది రోజుల క్రితం చల్లవానిపేట నుండి సారవకోట వెళ్లే రహదారికి అడ్డ పనస వెంకటాపురం ప్రాంతాల్లో మొక్కలు నాటుతూ వాటికి రక్షణ కడుతున్నారు. అనేకసార్లు రక్షణ కోసం లక్షల ఖర్చు చేసిన సంగతి అధికారులకు తెలుసు ప్రజలకు తెలిసిన సంగతి ఏది ఏమైనా మొక్కల కోసం లక్షల ఖర్చు చేసి లక్షయాన్ని దెబ్బతీస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి.

కొండపల్లికి రహదారి సౌకర్యం

విశాలాంధ్ర-పలాస/వజ్రపుకొత్తూరు : వజ్రపుకొత్తూరు మండలం చీపురుపల్లి పంచాయతీ కొండపల్లి గ్రామంలో శనివారం పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష సిసి రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శిరీష మాట్లాడుతూ మారుమూల ప్రాంతమైన కొండపల్లి గ్రామంలో నివాసముంటున్న వారికి 11 లక్షలు 20,000 రూపాయలతో సీసీ రోడ్డు మంజూరు చేశామని, కూటమి ప్రభుత్వం పేద ప్రజలకు అండగా ఉంటుందని అన్నారు.అలాగే రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఇచ్చిన మాట ప్రకారం మహిళలకు గ్యాస్ దిమ్మలో సంవత్సరంకు మూడు చొప్పున మంజూరు చేశారన్నారు. ఈకార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు సూరాడ మోహన్ రావు అరసవెల్లి ఉమామహేశ్వర శశి లైసెట్టి భీమారావు సాతపల్లి కామేశ్వరరావు సర్పంచ్ ప్రతినిధి దాసరి పాపారావు గుత్తేదారుడు ఎంపల్ల తులసిరావు సీనియర్ తెలుగుదేశం నాయకులు జోగారావు మెట్టూరు ఎంపీటీసీ సురేఖ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలు శోధనలో నైపుణ్యమే కీలకం : జిల్లా ఎస్పీ మహేశ్వరరెడ్డి

విశాలాంధ్ర-శ్రీకాకుళం స్పోర్ట్స్/క్రైం: ప్రస్తుత కాలంలో అధిక సంఖ్యలో జరుగుతున్న సైబర్ మోసాలు అరికట్టేందుకు,సైబర్ కేసులు సులభతరంగా ఛేదించేందుకు సాంకేతిక నైపుణ్యం ఎంతగానో ఉపయోగపడుతుందని కావున ప్రతి ఒక్కరు సాంకేతిక నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి అని జిల్లా ఎస్పీ కెవి మహేశ్వర రెడ్డి పేర్కొన్నారు. శనివారం శ్రీకాకుళం రూరల్ మండలంలోని గురజాడ విద్యా సంస్థలో జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో సైబరు నేరాల దర్యాప్తు'కు చేపట్టాల్సిన మెళుకవులు, తీసుకోవాల్సిన చర్యలు, కేసులు సులభతరంగా ఛేదించేందుకు సాంకేతిక నైపుణ్యం పై నిర్వహించిన సైబర్ నేరాల అవగాహన, శిక్షణ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ -నైపుణ్యం అనేది నిరంతర ప్రక్రియ ద్వారా లభిస్తుందని, సైబర్ కేసులు ఛేదించడంలో ప్రతి అంశాన్ని కూడా కీలకంగా తీసుకోవాలని అన్నారు.ప్రస్తుతం లభిస్తున్న టూల్స్, బేసిక్ నాలెడ్జ్ తోపాటు హ్యూమన్ ఇంటెలిజెన్స్‌తో కేసులు చాకచక్యంగా సులభంగా చేదించవచ్చునని ఎస్పీ పేర్కొన్నారు. ప్రస్తుతం నేరాల తీరు మారుతున్నదని, ప్రతీ నేరం కూడా సైబరు క్రైం, సాంకేతికతతో ముడిపడి ఉంటున్నదన్నారు. ఈ నేరాలను చేధించేందుకు దర్యాప్తు అధికారులకు కూడా ప్రత్యేకమైన శిక్షణ, వృత్తి నైపుణం అవసరమన్నారు. వృత్తి నైపుణ్యంను మెరుగు పర్చుకుంటే రాబోయే రోజుల్లో సైబరు నేరాల దర్యాప్తు సులభతరం అవుతుందని, సైబరు మోసాలకు, నేరాలకు పాల్పడిన వ్యక్తులను అరెస్టు చేసి, చట్ట పరిధిలో శిక్షించడంతోపాటు, వారు దోచుకున్న నగదును తిరిగి రికవరీ చేసే బాధితులకు న్యాయం చేకూర్చావచ్చునని తెలిపారు.కావున, సైబరు మోసాల,నేరాల కేసులను దర్యాప్తు చేసే అధికారులు ఈ శిక్షణను సద్వినియోగం చేసుకొని, సాంకేతిక నైపుణ్యాన్ని మెరుగుపర్చుకొని, భవిష్యత్తులో పోలీసుశాఖకు పెను సవాలుగా నిలిచే సైబర్ నేరాలు అడ్డుకట్ట వేయాలని జిల్లా ఎస్పీ అన్నారు. సైబరు నిపుణులు సాయి రామానుజ మాట్లాడుతూ - సైబరు నేరాలను, మోసాలను చేధించడం చాలా సులభమని, అందుకు అవసరమైన అవగాహన, వృత్తి నైపుణ్యం దర్యాప్తు అధికారులకు అవసర మన్నారు. అనంతరం, సైబరు నిపుణులు సాయి రామాన్నంజుని జిల్లా ఎస్పీ మహేశ్వర రెడ్డి సాలువతో సత్కరించి, జ్ఞాపికను బహూకరించారు. ఈ కార్యక్రమంలో శ్రీకాకుళం టౌన్ డీఎస్పీ సి.హెచ్ వివేకానంద, మహిళ పోలీసు స్టేషన్ డిఎస్పీ రాజశేఖర్, కలశాల ప్రిన్సిపల్ మురళీ కృష్ణ, జిల్లావ్యాప్తంగా ఉన్న సిఐలు ఎస్ఐలు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉజ్జీవంగా సువార్త సేవ కార్యక్రమం

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్: ప్రజలారా నాయొద్దకు రండి.. మీకు నేను విశ్రాంతి ని కలుగజేసెదను అని లోకరక్షుడు ఏసుక్రీస్తు తెలియజేశారని నగరంలో గల తెలుగుబాప్టిస్ట్ చర్చి రెండవ ఆరాధన సంఘ కాపరి అశోక్ కుమార్ తెలియజేశారు. ఆయన శనివారం ఎచ్చెర్ల మండలం లోగల 40 గ్రామాల్లో ప్రభువైన ఏసుక్రీస్తు నామం పేరిట సువార్త కార్యక్రమాన్ని తెలుగు బాప్టిస్ట్ సేవా సంస్థ ప్రెసిడెంట్ ఎం. ఆనంద రత్నకుమార్, సెక్రటరీ ఎమ్మెల్సీ శేఖర్, ట్రెజరర్ పి. సునీల్ ప్రసాద్, కోర్‌కమిటీ కన్వీనర్ డీబీడీబీ కుమార్ తదితరులు ఆధ్వర్యంలో సంఘ సభ్యులంతా పాల్గొని దేవునికి మహిమకరంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా చేయాలి

ఎంపీడీవో ఎం.రమేష్ నాయుడు

విశాలాంధ్ర-పలాస/వజ్రపుకొత్తూరు : మండలంలోగల నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా చేయడమే ఉల్లాస్ ముఖ్య ఉద్దేశమని ఎంపీడీవో ఎం రమేష్‌నాయుడు అన్నారు. శనివారం ఎంపీడీఓ కార్యాలయం లో ఉల్లాస్ కార్యక్రమంపై మండలస్థాయి శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సొసైటీలో ఉన్నవారందరిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు వాలంటీర్ టీచర్ లు ఓపిక, సహనంతో ఉండాలని అన్నారు. అనంతరం సెర్ప్ ఏపీఎం గొడబ ప్రసాదరావు మాట్లాడుతూ ఫైనాన్సియల్ లీటరసీ, లీగల్ లీటరసీ, డిజిటల్ లీటరసీ వంటి విషయాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం ఈఓపిఆర్డి, సీసీలు, వివోయేలు, వాలంటీర్ టీచర్‌లు పాల్గొన్నారు.

జిల్లా పోక్సో కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా వాన కృష్ణచంద్

విశాలాంధ్ర-శ్రీకాకుళం స్పోర్ట్స్/క్రైం : ఇప్పటివరకు జిల్లా ఫామిలీ కోర్ట్ పబ్లిక్ ప్రోసెక్యూటర్‌గా వ్యవహరిస్తున్న వాన కృష్ణ చంద్‌కు జిల్లా పోక్సో కోర్ట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా అదనపు బాధ్యతలను రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ ప్రోసెక్యూషన్స్ శనివారం నుంచి అప్పగించింది. ఈ రెండు కోర్ట్లే కాకుండా ఆయన ప్రస్తుతం శ్రీకాకుళం ప్రిన్సిపల్ అసిస్టెంట్ సెషన్స్ కోర్టు కు, సోంపేటలో ఉన్న 6వ జిల్లా అదనపు సెషన్స్ జడ్జి కోర్టు, మరియు సోంపేటలో ఉన్న ఆదనపు అసిస్టెంట్ సెషన్స్ జడ్జి కోర్ట్ కు, శ్రీకాకుళం జిల్లా కేంద్రం లోని 4 వ జిల్లా అదనపు సెషన్స్ జడ్జి కోర్ట్ మరియు ఏసీ, ఎస్టీ కేసుల ప్రత్యేక కోర్ట్‌కు, శ్రీకాకుళం అదనపు అసిస్టెంట్ సెషన్స్ జడ్జి కోర్టు లో ఉన్న అన్ని కౌంటర్ కేసులకు ప్రత్యేకపబ్లిక్ ప్రోసెక్యూటర్గా కూడా వ్యవహరిస్తున్నారు. ఇప్పటివరకు ఫోక్సో కోర్టుకు పబ్లిక్ ప్రోసెక్యూటర్ గా వ్యవహరిస్తున్న ఎల్ వి రమణ స్థానంలో ఈయన్ని నియమించినట్లు, రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ ప్రోసెక్యూషన్స్ తన ఉత్తర్వులో పేర్కొన్నారు. కృష్ణ చంద్ నియామకంపై స్టేట్ బార్ కౌన్సెల్ బార్ కౌన్సిల్ మెంబర్ గేదెల వాసుదేవరావు, బార్ అసోసియేషన్ అధ్యక్షులు కె.ఈశ్వరరావు, పూర్వ అధ్యక్షులు,టి రాధాకృష్ణ, శిష్టురమేష్, పి.వి. రమణారావు, వై.మురళీ మోహనారావు, బి.ఫల్గుణరావు ఎన్నిసూర్యారావు, అన్నెపు సత్యనారాయణ,వి. మల్లిబాబు,గంగు కృష్ణారావు, కె.నాగభూషణరావు, పైడి వేణుగోపాల రావు, బార్ కార్యవర్గ ప్రతినిధులు, అన్నంనాయుడు, ప్రసన్నకుమార్, మామిడి క్రాంతి, చాపర రమేష్, జల్లు తిరుపతిరావు, జి. లక్ష్మీ, వి. జ్యోతిర్మయి, తంగి శివప్రసాదరావు, బి. యెస్ చలం, బాగాది రామ్మోహనారావు, కొంఖ్యన సుభాష్, ఎస్. వి ఆఫిస్ లీగల్ అడ్వైజర్, ఎమ్. యామినీరాణి డిఫెన్సె కౌన్సుల్స్, ఆఫీసు నాయుడు, పుట్ట అంజనీ, ఎన్, వి విశేషగిరిరావు, కె. భారత్‌కుమార్, బి.మురళికృష్ణ, కస్పా ప్రతాప్, కొమ్ము రమణమూర్తి, సిహెచ్ లక్ష్మణరావు, ఏ. ఉమామహేశ్వరరావు, మెట్ట సత్యనారాయణ, జిల్లాలోని వివిధ స్వచ్ఛంద సంస్థలు, సామాజికవర్గపెద్దలు, తదితరులు హర్షం వ్యక్తపరిచారు.

రాష్ట్ర కళింగ సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ అధ్యక్షుడిగా రోణంకి

విశాలాంధ్ర-పోలాకి : రాష్ట్ర ప్రభుత్వం నామినేటెడ్ పదవులను శనివారం ప్రకటించింది. ఈ మేరకు పోలాకి మండలం ఉరజాం గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ నాయకుడు రోణంకి కృష్ణంనాయుడు ఎంతో కాలంగా నరసన్నపేటలో న్యాయవాదిగా పనిచేస్తున్నారు. టిడిపిలో ఈయన నమ్మినబంటుగా సాధన చేశారు. ఈ మేరకు ప్రభుత్వం గుర్తించి ఈయనకు తెలుగుదేశం పార్టీ నుండి రాష్ట్ర కళింగ సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ అధ్యక్షునిగా ఆదేశాలు జారీ కావడంతో కృష్ణంనాయుడుకు టిడిపి పార్టీ ప్రజా ప్రతినిధులు అభిమానులు గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

అభివృద్ధి సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం

ఎమ్మెల్యేలు ఎన్ఐఆర్, గొండు శంకర్

విశాలాంధ్ర-ఎచ్చెర్ల : అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలే కూటమి ప్రభుత్వం ధ్యేయమని ఎచ్చెర్ల, శ్రీకాకుళం ఎమ్మెల్యేలు నడుకుదిటి ఈశ్వరరావు, గొండు శంకర్ అన్నారు. ఎచ్చెర్లలో విశ్రాంత వీఆర్వో జరుగుళ్ల వెంకటరమణ నాయుడు సొంత నిధులతో నిర్మిం చిన బసెల్టర్ను శనివారం వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన మాటలకు కట్టుబడి పాలన సాగిస్తున్నట్టు చెప్పారు. మౌలిక సదుపాయాల కల్పనకు పల్లె పండగ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా అమలుచేస్తున్నట్టు తెలిపారు. అధికారం చేపట్టిన వెంటనే పింఛన్లను రూ.4 వేలకు పెంచినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా తెదేపా మాజీ అధ్యక్షుడు చౌదరి నారాయణమూర్తి, మండల తెదేపాఅధ్యక్షుడు బెండు మల్లేశ్వరరావు, మాజీ సర్పంచ్లు మెండ రాజారావు. పొందూరు భీమారావు, కూటమి నేతలు సంపతిరావు నాగేశ్వరరావు, వావిలపల్లి రామకృష్ణ, మూకళ్ల భాస్కరరావు, పైడి అన్నంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి పరామర్శించిన ఎమ్మెల్సీ

విశాలాంధ్ర-టెక్కలి : మండలంలో అయోధ్యపురం గ్రామంలో వైసీపీ కార్యకర్త దుంపల.ఈశ్వరరావు తండ్రి ఇటీవల కాలంలో మరణించిన విషయం ఎమ్మెల్సీ దువ్వాడ. శ్రీనివాస్ తెలుసుకొని వారి కుటుంబ సభ్యులను కలిసి పరేమర్శించారు. అనంతరం టెక్కలిలోని వైసీపీ నాయకులు చలపాకుల.చంటి సోదరుడు ఇటీవల కాలంలో మరణించిన విషయం తెలుసుకొని వారి కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించారు. తదనంతరం టెక్కలి తహసీల్దార్ వారి కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్న శ్రావణ్ కుమార్ భార్య ఇటీవల కాలంలో మరణించిన విషయం తెలుసుకొని వారి కుటుంబ సభ్యులను కలిసి ప్రగాఢ సానుభూతి తెలియజేసారు. ఈ కార్యక్రమంలో గొల్లపల్లి తేజ, నర్సింగ్ సాభతో, మాజీ డైరెక్టర్ ఉర్జాన విశ్వనాథం, మదీన్, కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

ఆటోను ఢీకొన్న ద్విచక్ర వాహనం... ఆరుగురికి గాయాలు

విశాలాంధ్ర-నందిగాం: మండలం మద్దిలవానిపేట సమీపంలో జాతీయ రహదారిపై ఆటోను ద్విచక్ర వాహనం ఢీకొన్న నేపథ్యంలో ఆటోలో ఉన్న నలుగురికి ద్విచక్ర వాహనంపై ఉన్న ఇద్దరికీ గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వజ్రపు కొత్తూరు మండలం బెండి గ్రామానికి చెందిన ధర్మారావు నందిగాం మండలం రౌతుపురంకి చెందిన తన పిన్ని కొడుకు చిరంజీవిని తన ద్విచక్ర వాహనంపై ఎక్కించుకొని శ్రీకాకుళం దగ్గర ఉన్న తోటపాలేంకి పెళ్లి సంబంధం చూసేందుకు వెళ్లి తిరిగి వస్తుండగా శ్రీకాకుళం దగ్గర ఉన్న పాత్రుని వలస నుంచి టెక్కలి మండలం రావివలస వెళ్లడానికి ఆరుగురు ప్రయాణికులను ఎక్కించుకొని ఆటో వస్తుంది. టెక్కలి నుంచి రావివలస వెళ్ళాలి ఇలా వచ్చేసాం అని ఆటో డ్రైవర్ ఉన్నపలంగా సిగ్నల్ వేయకుండా సంఘటనా స్థలం వద్ద ఆటోను తిరిగి రావి వలస వెళ్లేందుకు తిప్పగా వెనకనుంచి వస్తున్న ద్విచక్ర వాహనం బలంగా ఢీకొట్టింది. ద్విచక్ర వాహనంపై వస్తున్న ఇద్దరికీ ఆటో డ్రైవర్ తో పాటు ఆటోలో ఉన్న ముగ్గురికి గాయాలయ్యాయి. హైవే అంబులెన్స్ లో క్షతగాత్రులను టెక్కలి జిల్లా ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించగా ఇద్దరికీ మెరుగైన చికిత్స అందించడానికి శ్రీకాకుళం సర్వజన ఆసుపత్రికి తరలించారు. ధర్మారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై షేక్ మొహమ్మద్ అలీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు.

లింగాలవలస పంచాయతీలో రహదారి నిర్మాణ పనులు ప్రారంభం

విశాలాంధ్ర-టెక్కలి : వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెనాయుడు ఆదేశాల మేరకు మండలంలో లింగాలవలస పంచాయితీ పరిధిలో వివిధ గ్రామాలలో సుమారుగా 60 లక్షల రూపాయలు సిమ్మెంట్ రహదారుల నిర్మాణ పనులు ను పంచాయతి మాజీ సర్పంచ్ సంపతిరావు రవీంద్రనాథ్ ప్రారంభించారు. కొన్ని సంవత్సరాల నుండి రహదారి లేక అనేక అవస్థలు పడ్డామని, కూటమి ప్రభుత్వంతో రహదారని నిర్మాణాలు చేసినందుకు పంచాయతి ప్రజలు,కార్యకర్తలు సంతోషంతో మంత్రి అచ్చెనాయుడు కు ధన్యవాదములు తెలియజేశారు.

రహదారుల నిర్మాణాలకు కృషి : పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష

విశాలాంధ్ర-పలాస : పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో రహదారుల నిర్మాణాలకు కృషి చేస్తామని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. శనివారం మదర్ థెరీసా పాఠశాల ఎదురుగా 5 లక్షల రూపాయలు నిధులతో సీసీ రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మున్సిపాలిటీ ప్రజల మౌలిక సదుపాయాలను పరిగణలోకి తీసుకుని వాటిని పరిష్కరిస్తామన్నారు. అనంతరం మదర్ థెరీసా పాఠశాల ఆవరణలో నూతనంగా ఏర్పాటు చేసిన మహాత్మ జ్యోతిరావు పూలే పాఠశాలను ప్రారంభించారు. అలాగే మండలం రామకృష్ణాపురం కొత్త గల సత్యసాయి విద్యా విహార్ పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులకు బోధన సామాగ్రి మరియు సైన్స్ పరికరాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ట్రేడ్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబురావు, మాజీ ఏఎంసీ చైర్మన్ మల్లా శ్రీనివాసరావు, బద్ద నాగరాజు, సప్ప నవీన్, దొక్కరి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

వై.సి.పి నాయకుని మృతి

విశాలాంధ్ర-ఇచ్ఛాపురం : పట్టణ వై.సి.పి మాజీ అధ్యక్షులు కాళ్ళ దేవరాజ్ (63) అనారోగ్యంతో శనివారం తుది శ్వాస విడిచారు. రాజకీయాల్లో క్రియాశీలకంగా వ్యవహరించిన అతని మృతి పట్ల పలువురు తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేసారు. తీవ్ర అనారోగ్యానికి గురైన అతన్ని మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం ఓ ప్రైవేటు ఆసుపత్రికి కుటుంభ సభ్యులు తరలించగా అక్కడ మరణించిన అతని పార్థివ దేహానికి శనివారం బలరాంపేటలో అభిమానులు పలువురు రాజకీయ నాయకులు సందర్శించి నివాళులు అర్పించారు. దేవరాజ్ మృతితో యాదవ కులంలో గొప్ప నాయకున్ని కోల్పోయామని పలువురు విచారాన్ని వ్యక్తం చేసారు. గతంలో తెలుగుదేశం పార్టీ మున్సిపల్ ఛైర్మన్ స్థానానికి ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేసిన ఆయన అనంతరం వై.సి.పి పట్టణ కన్వీనర్‌గా వ్యవహరించారు. అతని భార్య శకుంతల గత మున్సిపల్ కౌన్సిల్ వైస్ ఛైయిర్‌పర్సన్‌గా వ్యవహరించారు. ఎమ్మెల్యే డాక్టర్ బెందాళం అశోక్, 22వ వార్డు కౌన్సిలర్ కాళ్ళ దిలీప్, 11వ వార్డు కౌన్సిలర్ ఆశి లీలారాణి తదితరులు అతనికి నివాళులు అర్పించారు. దేవరాజ్ మరణ వార్త తెలుసుకుని అతని ఇంటి వద్దకు చేరుకున్న వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, అభిమానులతో అంతిమ యాత్ర నిర్వహించారు. దేవరాజ్ మరణం పట్ల మున్సిపల్ ఛైయిర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి దంపతులు, పి.ఏ.సి.ఎస్ అధ్యక్షుడు నర్తు నరేంద్ర, వై.సి.పి ప్రచార విభాగం కన్వీనర్ ఆదిరెడ్డి, కోఆప్షన్ సభ్యుడు ప్రత్తి విజయ్‌కుమార్, న్యాయవాదులు ఎన్.విశ్వనాథ్, ఎస్వీఎస్ రంగారాజు, లాబాల శంకర్, ఎం.రాంబాబు, నాగరాజ్ పాత్రో, గిన్ని సీతయ్య, వి.ఎస్.ఎం ఫౌండేషన్ ఛైర్మన్ వజ్రపు వెంకటేష్, మాటూరి సూర్యం, కౌన్సిలర్లు సుగు ప్రేమ్ కుమార్, గేదెల శేఖర్ తదితరులు సంతాపాన్ని వ్యక్తం చేసారు. ఎమ్మెల్యే పరామర్శ బెల్లుపడా కు చెందిన అనపాన జానకిరావు కుటుంబీకులు ఇటీవల మరణించడం తో వారి కుటుంబాన్ని ఎమ్మెల్యే స్థానిక నాయకులు నందికి జానకిరావు, ఆశి లీలారాణి, ఆశి చిరంజీవులు తదితరులతో కలిసి పరామర్శించారు.

'తెప్పల'కు నన్నయ విశ్వవిద్యాలయ పురస్కారం

విశాలాంధ్ర-పలాస: రాజమహేంద్ర వరం ఆదికవి నన్నయ విశ్వ విద్యాలయంలో శనివారం 32 ప్రపంచ రికార్డులు సొంతం చేసుకున్న శ్రీశ్రీ కళావేదిక 141వ జాతీయ శతాధిక కవి సమ్మేళనంలో పలాసకు చెందిన రచయిత, నటుడు, జనజాగృతి వ్యవస్థాపక అధ్యక్షులు లయన్ డా.తెప్పల కృష్ణమూర్తి పాల్గొని 'వృద్ధాప్యమూ వరమే' అను కవితాగానం చేసి ప్రశంసలు పొందారు. ఈ సందర్భముగా విశ్వవిద్యాలయ ఉప కులపతి ఆచార్య వై.శ్రీనివాసరావు, శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ చైర్మన్ డా.కత్తి మండ ప్రతాపరెడ్డి, జాతీయ కన్వీనర్ కొల్లి రమావతి, డా .పార్ధ సారథి చేతుల మీదుగా కృష్ణ మూర్తిని దుశ్శాలువా, జ్ఞాపిక, ప్రశంసా పత్రం, పుష్పమాలతో ఘనంగా సత్కారించారు. కృష్ణమూర్తిని పలాస లయన్స్ క్లబ్ అధ్యక్షులు హనుమంతు ఎందుదొర, జన జాగృతి అధ్యక్షులు కుమార నాయక్, ఉద్దానం సాహితీ వేదిక అధ్యక్షులు లండ రుద్ర మూర్తి, లిలిత కళారంజని అధ్యక్షులు చిన్నాచారి, తెరవే అధ్యక్షులు ఉత్తరావల్లి నాగేశ్వరరావు అభినందనలు తెలిపారు.

నియంత పాలనకు స్వస్తి పలకాలి

- వైసీపీ జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్



విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్ : రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు నియంత పాలనకు స్వస్తి పలకాలని వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణ దాస్ అన్నారు. వైసీపీ సోషల్ మీడియాపై ప్రభుత్వం కక్షకట్టి కేసులు పెడుతోందని అందులో భాగంగా జిల్లా ఎడిషన్ ఎస్పి కి పార్టీ ఆదేశాల మేరకు వినతి పత్రం శనివారం అందించారు. అనంతరం విలేకరులతో ఆయన కృష్ణదాస్ మాట్లాడుతూ రాష్ట్ర మొత్తం మీద చంద్రబాబు నాయుడు తుగ్లక్ పాలన చేస్తున్నారని విమర్శించారు. అంతేకాకుండా వైసిపి సోషల్ మీడియా పై తప్పుడు కేసులు బనాయించి వారిని ఇబ్బంది పెడుతున్నారని తెలిపారు, ప్రభుత్వం చేస్తున్న అక్రమాలపై ప్రశ్నించారననే అక్కసుతో మా సోషల్ మీడియా ప్రతినిధులపై తప్పుడు కేసులు పెడుతున్నారని, సుప్రీంకోర్టు మార్గదర్శకాలను కూడా పక్కనపెట్టి పోలీసులు వ్యవహరిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఎవరి మెప్పుకోసం ఈ కేసులు బనాయిస్తున్నారని, ఎల్లకాలం అధికారం ఒక్కరిదే ఉండదని గుర్తించుకోవాలని ప్రభుత్వ తీరును ఎండగట్టారు. ఆయనతోపాటు ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్ల కిరణ్ కుమార్, శ్రీకాకుళం మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ మెంటాడ పద్మావతి, పొన్నాడ రుషి,ఎద్ల వెంకట్ ,అంబటి శ్రీను,ముంజేటి కృష్ణ, రౌతు శంకర రావు,కామేశ్వరి,గేదేల పురుషోత్తం,వైసిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.